సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 19 । జనవరి । 2025



పల్లె నుంచి పట్నానికి..!

సంక్రాంతి పూర్తవ్వడంతో తిరుగు ప్రయాణాలు మొదలయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు కిటకిటలాడాయి.

- 8లో



ముగిసిన దేహ దారుఢ్య పరీక్షలు

ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలు శనివారంతో ముగిశాయి.

- 8లో

పందెంరాయుళ్ల అరెస్ట్

ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రం పరిసరాల్లో కోడిపందాలు కాస్తున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.13,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను శనివారం కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కోడి పందాలు, పేకాట, గుండు ఆటలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

ఆమె నేత్రాలు సజీవం



అన్నపూర్ణమ్మ

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పీఎస్ కాలనీలో 7వ లైన్‌లో నివాసముంటున్న తిర్లంగి అన్నపూర్ణమ్మ(73) గుండెపోటుతో శనివారం మృతిచెందారు. మరణాంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుటుంబసభ్యులు రమేష్, రోహిణికుమారి, రవిప్రసాద్, రోజాకుమారిలు రెడ్‌క్రాస్‌కు తెలియజేయగా.. నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, సహాయకులు పి.సుమతి స్పందించారు. అన్నపూర్ణమ్మ కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, హర్షవర్ధన్, దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842 699321 నంబరును సంప్రదించాలని కోరారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



గృహిణికి అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

నరసన్నపేట: మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ దివాస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం కార్యక్రమం విధిగా చేపటాలని ఆదేశించారు. నరసన్నపేటలో ఎక్కడికక్కడ చెత్త కనిపించిందని, భవిష్యత్తులో ఈ పరిస్థితి ఉండకూడదన్నారు. కార్యక్రమంలో డీపీఓ భారతి సౌజన్య, డీపీఆర్‌సీ నిశ్చల, ఎంపీడీఓ మధుసూదనరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఈఓ ద్రాక్షాయిని, ఈఓపీఆర్‌డీ రేణుక, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు పాల్గొన్నారు.

గడ్డి కుప్పలు దగ్ధం

రణస్థలం: రణస్థలం పంచాయతీ నగరప్పాలెం గ్రామంలో గంట్యాడ దాలినాయుడుకు చెందిన గడ్డి కుప్పలు శనివారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైనట్లు అగ్నిమాపక అధికారి పైల అశోక్ తెలిపారు. వెంటనే రణస్థలం అగ్నిమాపక శకటం వచ్చి గడ్డి కుప్పలకు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మంత్రి గారి తాలూకా..!

- దర్జాగా చెరువు కబ్జా
- కోటబొమ్మాళిలో టీడీపీ నేత బరితెగింపు

ప్రస్తుతం జోరుగా సాగుతున్న నిర్మాణం చిత్రం చూడండి. కోటబొమ్మాళి మండల కేంద్రంలో చెరువును ఏకంగా ఆక్రమించి చేస్తున్న నిర్మాణమిది. మంత్రి అనుచరుడు, టీడీపీ మండల నాయకుడు చేస్తున్న నిర్వాకమిది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతీసారి ఈయన ఆక్రమణ దందా సాగుతూనే ఉంది.





- చెరువు గర్భంలో అక్రమ నిర్మాణాలు
- గతంలోనూ ఆక్రమణకు ప్రయత్నాలు
- అప్పట్లో అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు
- కోర్టులో కొనసాగుతున్న స్థల వివాదం
- కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ అక్రమ నిర్మాణాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అధికారం ఇచ్చింది అక్రమాలకు పాల్పడటానికే అన్నట్టుగా కొందరు టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించేయడమే పనిగా రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల సహకారంతో దర్జాగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో కోర్టులో స్థల వివాదాలు ఉన్నప్పటికీ తీర్పులతో తమకు సంబంధం లేదన్నట్లుగా దౌర్జన్యాలకు దిగుతున్నారు. టెక్కలి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కొనసాగుతున్న కింజరాపు అచ్చెన్నాయుడు సొంత మండల కేంద్రంలో టీడీపీ మండల పార్టీ నాయకుడు దర్జాగా చెరువు గర్భాన్ని ఆక్రమించి మరీ అక్రమ కట్టడాలు నిర్మిస్తుండడంతో అంతా విస్తుపోతున్నారు. తన వెనుక మంత్రి ఉన్నారని.. ఎవరైనా అడ్డు వస్తే సహించేది లేదన్నట్లుగా మంత్రి పేరు చెప్పుకుని దౌర్జన్యంగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు.



అక్రమ కట్టడాలకు సిద్ధంగా ఉంచిన మెటీరియల్

బరితెగింపు..

కోటబొమ్మాళి మండల కేంద్రంలో మార్కెట్‌కు ఎదురుగా సర్వే నెంబర్ 91/2లో సుమారు 28 ఎకరాల 34 సెంట్లు మేర పెద్ద చెరువు ఉంది. రెవెన్యూ రికార్డుల్లో సైతం చెరువు గర్భంగానే నమోదై ఉంది. ఇదే స్థలంలో దశాబ్ద కాలం క్రితం టీడీపీ నాయకుడు కొంత మేరకు రైస్ మిల్లు నిర్మాణం చేపట్టారు. అప్పట్లో అధికారులు పట్టించుకోలేదు. 2014లో టీడీపీ అధికారంలో వచ్చాక మరికొంత స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారు. అప్పట్లో వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వేలు చేసి ఆ స్థలం చెరువు గర్భంగా తేల్చారు. అంతేకాకుండా మండల రెవెన్యూ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఫలితంగా ఆక్రమణలకు కొంత మేరకు ఫుల్‌స్టాప్ పడింది. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో ఆక్రమించే సాహసానికి పోలేదు. ఇదే స్థలంలో కొంతమంది పేదలు రేకుల షెడ్లు వేసుకోగా అప్పట్లో రెవెన్యూ అధికారులు ఖాళీ చేయించారు. దీంతో స్థలం ఖాళీగా ఉండిపోయింది. ప్రస్తుతం కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో స్థలానికి సంబంధించిన కేసు పెండింగ్‌లో ఉంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ఆ స్థలంపై కన్నేసిన మండల టీడీపీ నేత అక్రమ కట్టడాలకు ఉపక్రమించారు. ఇటీవల జోరుగా నిర్మాణ పనులు చేస్తున్నారు. అంతేకాక మరికొంత స్థలంలో రేకుల షెడ్లు వేసుకుని అద్దెలకు కూడా ఇచ్చుకోవడం గమనార్హం.

స్థలాన్ని పరిరక్షించాలి..



కోటబొమ్మాళిలో సర్వే నంబరు 91/2లో చెరువు గర్భంలో ఎటువంటి ఆక్రమణలు లేకుండా గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. దీంతో రెవెన్యూ అధికారులే కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం స్థలం సమస్య కోర్టు పెండింగ్‌లో ఉంది. ఇటీవల కాలంలో అదే స్థలంలో కట్టడాలు జరుగుతున్నాయి. ప్రజోపకారమైన పనుల కోసం వినియోగించాల్సిన స్థలంలో ఇలా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి స్థలాన్ని పరిరక్షించాలి.

– కె.సంజీవరావు, సర్పంచ్, కోటబొమ్మాళి

ఆపమని ఆదేశించాం...

చెరువు గర్భంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నట్లు మాకు సమాచారం వచ్చిన వెంటనే అక్కడకు వెళ్లి పరిశీలన చేశాం. అప్పటికే జరుగుతున్న పనులను ఆపివేశాం. పూర్తి స్థాయిలో సామాన్లు తొలగించేందుకు రెండు రోజులు గడువు ఇచ్చాం. ఎటువంటి అక్రమ కట్టడాలు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

– ఆర్.అప్పలరాజు, తహసీల్దార్, కోటబొమ్మాళి.

● ఆకుల్లేని అరటి గెల



ఆ అరటి గెలను చూసిన ప్రతిఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఆకులు లేకుండానే గెల వేసిందా అని? ఆశ్చర్యపోతున్నారు. ఇచ్ఛాపురం మండలం ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామం సదాలపుట్టి గ్రామంలోని రైతు వీరాస్వామి పెరట్లో ఈ చెట్టు ఉంది. రెండు నెలల క్రితం వీచిన గాలులకు చెట్టులో కొంతభాగం విరిగిపోయింది. దీంతో చెట్టు మధ్య నుంచి కొత్తగా అరటి గెల ఏర్పడింది.

– ఇచ్ఛాపురం రూరల్

● కమిషనర్‌పై కలెక్టర్ ఆగ్రహం!

- విధుల్లోకి చేరవద్దని ఆదేశం
- అనుమతి లేకుండా సెలవులే కారణం!

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పి.పి.వి.డి.ప్రసాదరావుపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చర్యలు చేపట్టినట్లు సమాచారం. కమిషనర్ ఎటువంటి ముందస్తు సమాచారాన్ని మున్సిపల్ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్‌కు ఇవ్వకుండా సెలవులోకి వెళ్లినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. సంక్రాంతి సెలవులు అనంతరం విధుల్లోకి చేరవద్దని, ప్రభుత్వం కేటాయించిన వాహనాన్ని వారం పాటు నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు కలెక్టర్ టేబుల్‌పై ఫైల్ ఉందని తెలుస్తోంది. కమిషనర్ ముందుగా కలెక్టర్, ప్రత్యేకాధికారికి తెలియజేయకుండా సెలవుపై వెల్లడం ఇది మూడో సారి కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది నవంబర్‌లో కూడా సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లినప్పుడు కలెక్టర్ హెచ్చరించారు. అయినా ఖాతరు చేయకుండా సంక్రాంతి సెలవులు తీసుకోవడం, కార్పొరేషన్ కార్యాలయంలో ఫైల్స్ పెండింగ్‌లో ఉండటం, స్పందన ఫిర్యాదులు సైతం పరిష్కారం చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారని కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. చేతనైతే పనిచేయాలని, లేకుంటే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఓ పక్క రాజకీయ ఒత్తిళ్లు, మరోవైపు అధికారులు ఒత్తిడి మేరకు కమిషనర్ విధులు నిర్వహించలేక ఇబ్బందిపడుతున్నారని కార్పొరేషన్‌లో పలువురు అధికారులు చెబుతున్నారు.

● హెల్మెట్ ధారణ తప్పనిసరి



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ద్విచక్ర వాహనాలు నడిపే వారంతా విధిగా హెల్మెట్లు ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదన్నారు. హెల్మెట్‌తో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం అత్యంత సురక్షితమని, అనుకోని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు ప్రాణాలతో బయటపడేందుకు హెల్మెట్ రక్షణగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం ఆంధ్రా ఆర్గానిక్ లిమిటెడ్(పైడి భీమవరం), పంజాబ్ నేషనల్ బ్యాంక్(సూర్యమహల్ బ్రాంచ్), ఇండియన్ బ్యాంక్(మహిళా కళాశాల బ్రాంచ్, అరసవిల్లి) సౌజన్యంతో పలువురు కోర్టు ఉద్యోగులకు హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, 1వ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, 3వ అదనపు జిల్లా జడ్జి సి.హెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్, 6వ అదనపు జిల్లా జడ్జి(సోంపేట) కె.కిషోర్‌బాబు, సీనియర్ సివిల్ జడ్జి(రాజాం) కె.శారదాంబ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎల్.హిమబిందు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ యుగంధర్, సీనియర్ సివిల్ జడ్జి(సోంపేట) జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రశాంతంగా జవహర్ నవోదయ పరీక్ష



పరిశీలిస్తున్న నవోదయ ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య, పరిశీలకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకుగాను శనివారం జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 8290 మంది విద్యార్థులకు గాను 7281 మంది హాజరయ్యారు. 1009 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జవహర్ నవోదయ విద్యాలయం వెన్నెలవలస ప్రిన్సిపాల్ దాసరి పరశురామయ్య, ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ కమిషనర్ లియాకత్ అలీఖాన్ పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

● రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20 నుంచి 31 వరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు రాజగోపాలరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పశు వైద్యచికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందు, పశువ్యాధి నిర్ధారణ, పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రతి మండలానికి రెండు బృందాలు కేటాయించామని, అందులో పశువైద్యాధికారి, పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్ర, పశు సంవర్ధక సహాయకులు, అటెండర్ ఉంటారని వివరించారు.

- ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు
- 32 చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- 104 తులాల బంగారు ఆభరణాలు రికవరీ

- అనుమానం రాకుండా.. అంతా దోచుకోకుండా..

కేజింపావు బంగారం ▸ కొట్టేశారు





వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి. చిత్రంలో డీఎస్పీ వివేకానంద, సీఐలు అవతారం, పైడపునాయుడు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది



రికవరీ చేసుకున్న సొత్తు..

శ్రీకాకుళం క్రైమ్:

దొంగలొచ్చారన్న విషయం ఇంటి తలుపులకే తెలియదు.. తాళాలకు సుత్తిదెబ్బలూ ఉండవు.. రాళ్ల దెబ్బలూ పడవు.. కిటికీలు, గ్రిల్స్ తొలగించిన దాఖలాలు కనబడవు.. దర్జాగా ఇంటి తాళం ఎక్కడుందో ముందే తెలుసుకుని లోపలికి వెళ్తారు.. బీరువాలో వస్తువులు చిందరవందరగా పడేయకుండా ఎన్ని బంగారు వస్తువులున్నా ఒకట్రెండే తమ లక్ష్యమన్నట్లు.. మూడో కంటికి తెలియకుండా ఏడాది వ్యవధిలో 32 చోరీలకు పాల్పడ్డారు ఇద్దరు యువకులు. మొత్తం 112 తులాల బంగారాన్ని కాజేశారు. ఈ చోరీల ప్రణాళికలో విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన పున్నాన రాంబాబు (30)ది మాస్టర్ మైండ్ కాగా, మన జిల్లాలోని జి.సిగడాం మండలం గెద్ద కంచరాం గ్రామానికి చెందిన గిడిజాల కోటేశ్వరరావు (33) భాగస్వామిగా ఉన్నాడు. జైలు గోడల మధ్య పరిచయమైన వీరి బంధం మళ్లీ అక్కడికే తీసుకెళ్లేలా చేసింది. రూ. 84.44 లక్షల విలువైన 104 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు.

రంజీ జట్టు ఎంపికలో మోసపోవడంతో..

పున్నాన రాంబాబు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విజయవాడలోని తన అత్తగారింటి వద్ద చదువుకున్నాడు. మొబైల్ అప్లికేషన్లు, హార్డ్‌వేర్ వంటి సాంకేతిక పరిజ్ఞానంలో ప్రావీణ్యాన్ని సంపాదించుకున్నాడు. చిన్నప్పటినుంచి క్రికెట్‌పైన మక్కువ ఉండటంతో అక్కడే ఓ కోచ్ వద్ద మెలకువలు సాధించాడు. అయితే రంజీ జట్టుకు ఎంపిక విషయంలో కోచ్ తనను మోసం చేయడం తట్టుకోలేని రాంబాబు వ్యసనాల బాట పట్టాడు. క్రికెట్ బెట్టింగ్ కోసం డబ్బులు దుబారాగా ఖర్చుపెట్టడం .. అది కాస్తా ఆస్తి నేరాలు చేసేలా దారి తీసింది. ఈ క్రమంలో ఎస్.కోట, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరు తదితర పోలీస్ స్టేషన్లలో గతంలో నమోదైన 30 కేసుల్లో అరెస్టయి జ్యుడీషియల్ రిమాండ్‌కు కూడా వెళ్లాడు.

జైలులో కోటేశ్వరరావుతో పరిచయం..

రెండో నిందితుడైన గిడిజాల కోటేశ్వరరావు స్వగ్రామం జి.సిగడాం మండలం గెద్ద కంచరాం. శ్రీకాకుళంలో ఉండేవాడు. భార్య భరణం కేసులో 2021లో అరెస్టయి శ్రీకాకుళం జైలుకు వెళ్లినప్పుడు అక్కడే ఉన్న రాంబాబుతో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక తనతో పాటు నేరాల్లో పాలుపంచుకోవడానికి ప్రణాళిక వేసుకున్నాడు. రాంబాబు దొంగిలించిన సొత్తును ముత్తూట్ ఫిన్‌కార్ప్, ముత్తూట్ మినీ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టడానికి కోటేశ్వరరావుకు ఇచ్చేవాడు. దానికి కమీషన్‌గా వచ్చే డబ్బుల్లో పదిశాతం వాటా ఇచ్చేవాడు. కొన్ని నేరాల్లో కోటేశ్వరరావు కూడా పాల్గొనేవాడు.

ఏడాది వ్యవధిలో 32 చోరీలు..

ఈ క్రమంలో 2024 నుంచి 2025 వరకు శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో 32 చోరీలు చేశారు. ఎచ్చెర్ల పీఎస్ పరిధిలో 11 చోరీలు, లావేరు పీఎస్ మూడు, శ్రీకాకుళం ఒకటో పట్టణ పీఎస్ నాలుగు, శ్రీకాకుళం రూరల్ పీఎస్ రెండు, గార పీఎస్ రెండు, శ్రీకాకుళం రెండో పట్టణ పీఎస్ నాలుగు, పొందూరు పీఎస్ మూడు, పోలాకి పీఎస్ ఒకటి, విశాఖజిల్లా పీఎంపాలెం పీఎస్ ఒకటి, వీఎస్పీ సిటీ ఒకటి చేశారు. వీరు చేసిన చోరీలన్నీ బంగారు వస్తువులే కావడం గమనార్హం.

ఎచ్చెర్ల కేసులో తీగ లాగితే..

2024 డిసెంబరులో ఎచ్చెర్లలో ఫంక్షన్ కోసం వెళ్తున్న కుమార్తెకు తన తల్లి బీరువాలో భద్రపర్చిన ఐదున్నర తులాల బంగారు కాసుల పేరు, చైన్ ఇచ్చింది. తిరిగొచ్చాక మళ్లీ పెట్టేసింది. పండగ సందర్భంగా ఇల్లు శుభ్రం చేద్దామని ఈ నెల 7న బీరువా తెరవగా రెండు నగలూ కనిపించలేదు. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సందీప్ దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అనేక విషయాలు బయటపడుతుండటంతో డీఎస్పీ సిహెచ్ వివేకానంద పర్యవేక్షణలో జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఒకటో పట్టణ సీఐ సీహెచ్ పైడపునాయుడులతో కూడిన బృందాలు దర్యాప్తు ముమ్మరం చేయడంతో మరిన్ని విషయాలు బయటపడ్డాయి. 2022లో అరెస్టయి విశాఖపట్నం సెంట్రల్ జైల్‌కు వెళ్లిన రాంబాబు మళ్లీ 2024 జనవరి 10న విడుదలైన మరొకరి సాయంతో ఈ నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు.

పట్టుబడ్డారిలా..

ఈ నెల 17న సాయంత్రం తమకొచ్చిన సమాచారంతో ఎచ్చెర్ల, లావేరు ఎస్ఐలు సందీప్‌కుమార్, చిరంజీవిలు సిబ్బందితో కలిసి అరిణం అక్కివలస కూడలిలోని ప్రకృతి లేఅవుట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ప్రతిభకు ప్రశంసలు..

భారీ కేసును డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో ఛేదించిన సీఐలు ఎం.అవతారం, సీహెచ్ పైడపునాయుడు, ఎస్ఐలు సందీప్‌కుమార్, చిరంజీవి, జి.లక్ష్మణరావు, సిహెచ్ మధుసూదనరావు, మిగతా సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో మిగిలిన ఎనిమిది తులాల బంగారాన్ని రికవరీ చేసే పనిలో ఉన్నట్లు చెప్పారు.

వీరి చోరగుణం.. ఆసక్తికరం..



పోలీసుల విచారణలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇంటి భద్రత విషయంలో మనం మరింత అప్రమత్తమవ్వాల్సిన అవసరం ఉందని తేల్చిచెప్పాయి.

- పోలీసులు వచ్చి చెప్పేవరకు తమ ఇంట్లో దొంగతనం జరిగిందని బాధితులకే తెలియకపోవడం గమనార్హం.
- ఎక్కడా వేలిముద్రలు పడకుండా జాగ్రత్తపడేవారు.
- ఒకటి రెండు వస్తువులే తీయడంతో కుటుంబంలోని వారు ఇంటిదొంగ పని అని భావించేలా..సీన్ క్రియేట్ చేయడంతో పలు ఇళ్లల్లో కొట్లాటలు కూడా జరిగినట్లు సమాచారం.
- ప్రజలు కూడా నిర్లక్ష్యం వహించకుండా తాళాలను తమ వెంటే తీసుకెళ్లాలని, బయట ఉంచకూడదని పోలీసులు సూచించారు.
- ఇంట్లో చోరీ జరిగిందని గ్రహించిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.



- ఇంటి ఆవరణలోని మార్బ్యాక్, ఎలక్ట్రికల్ మీటర్ రీడింగ్‌బోర్డు, పూల కుండీలు, కిటికీలోపల తదితర చోట్ల తాళాలు పెట్టే వారి ఇళ్లే వీరి లక్ష్యం
- ఇంట్లో వారికి అనుమానం రాకుండా ఎదురుగా ఎంత బంగారం ఉన్నప్పటికీ నాలుగైదు తులాలకు మించి ఎప్పుడూ చోరీ చేయకపోవడం విశేషం.

క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ విజయ పరామర్శ



పాలవలస రాజశేఖరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ దివంగత పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శనివారం పరామర్శించారు. పాలకొండలోని ఆయన నివాసంలో రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, అతని సతీమణి ఇందుమతి రాజశేఖరం, కుమార్తె, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిలకు సానుభూతి తెలిపారు. ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఉన్నారు.

21న మెగా ఉద్యోగ మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నిరుద్యోగులకు తీపికబురు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), సీడాప్ సంయుక్తంగా ఈ నెల 21న భారీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నాయి. అపోలో ఫార్మసీ, అవంతి ఫ్రోజెన్ ఫుడ్, సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని 340 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పథక సంచాలకుడు పి.కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఐటీఐ, పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకేరోజు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. సినర్జీస్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీలో ట్రైనీ టెక్నీషియన్, ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు 18 నుంచి 35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, ఏడాదికి రూ.1,70,000 జీతం లభిస్తుందని తెలిపారు. అపోలో ఫార్మసీలో 240 ఫార్మసిస్ట్, ఫార్మా ట్రైనర్ పోస్టులకు ఫార్మసీ, ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులు అర్హులని, నెలకు రూ.10,500 నుంచి రూ.14,000 వరకు జీతం లభిస్తుందని వివరించారు. అవంతి ఫ్రోజెన్ ఫుడ్ కంపెనీలో ప్యాకర్స్ పోస్టులకు టెన్త్ ఉత్తీర్ణత గల మహిళా అభ్యర్థులు అర్హులని, నెలకు గరిష్టంగా రూ.13,500 జీతం లభిస్తుందని తెలిపారు.

అడవి పందుల స్వైర విహారం



సీతాపురం తోటల్లో ధ్వంసమైన కొబ్బరి చెట్టు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు తదితర గ్రామాల్లో అడవి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో ఆహారం కోసం తోటల్లో సంచరిస్తూ కొబ్బరి చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం పంట పొలాల్లో అడవి పందులకు సరైన ఆహారం దొరకకపోవడంతో కొబ్బరి చెట్టుకున్న కందను తినేందుకు అలవాటుపడ్డాయని, దీంతో కొబ్బరి చెట్లను ధ్వంసం చేస్తున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. తిత్లీ తుఫాన్ ప్రభావంతో కొబ్బరి చెట్లు కూలిపోవడంతో వాటి స్థానంలో నాటిన కొబ్బరి చెట్లను నాశనం చేస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనస సీజన్ ప్రారంభం



పలాసలో పనసకాయలు విక్రయిస్తున్న రైతులు

పలాస: పలాస నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలో జీడి కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగవుతున్న పనసకు పలాస మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. సంక్రాంతి తర్వాత ప్రతి ఏడాది ఈ పంటను రైతులు పలాస పట్టణంలో ఉన్న షావుకార్లకు ఆటోల్లో తీసుకొచ్చి కిలోల చొప్పున విక్రయిస్తుంటారు. ప్రస్తుతానికి పంట లాభసాటిగా ఉందని మాకన్నపల్లి గ్రామానికి చెందిన రైతు తెప్పల అజయ్‌కుమార్ చెప్పారు. కిలో లేత పనసకాయలు రూ.25 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. రోజుకు రెంటు టన్నులు చొప్పున ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నామని కాశీబుగ్గకు చెందిన పనసకాయల వ్యాపారి పాత్రో చెప్పారు. ప్రస్తుతం పలాస,మందస, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి రైతులు తీసుకొని వచ్చి అమ్ముతున్నారన్నారు. ఈ సమయంలో కొనుగోలు చేసిన పనసకాయలను కూరలు, పచ్చళ్లు, ఇతర అవసరాలకు ఉత్తరాది ప్రజలు వినియోగిస్తున్నారని, మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందని చెప్పారు. జీడి పంట సీజన్‌కు ముందు పనస, మునగ పంటలు రైతులకు ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నాయి. ఈ డబ్బులనే జీడి పంటలో సస్య రక్షణ చర్యలకు పెట్టుబడిగా వాడుకుంటారు. ఇంటి అవసరాలకు కూడా ఉపయోగపడతాయని అమ్మకానికి వచ్చిన రైతు తెప్పల బీమయ్య చెప్పారు.

పల్లెకు టాటా.. పట్నం బాట

- ప్రయాణికులతో కిక్కిరిసిన కాంప్లెక్స్
- సంక్రాంతి పూర్తవ్వడంతో తిరుగు ప్రయాణాలు
- రద్దీగా మారిన బస్సులు



ప్రయాణికులతో రద్దీమయంగా మారిన ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం అర్బన్:

సంక్రాంతి సంబరాల కోసం స్వగ్రామాలకు వచ్చిన జనం పండగ ముగియడంతో మరలా భారమైన హృదయాలతో తిరుగు పయనమవుతున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులతో శనివారం కిటకిటలాడుతూ కనిపించింది. జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి పిల్లాపాపలతో, మూటాముల్లతో తమతమ ప్రాంతాలకు బయల్దేరడంతో బస్సులన్నీ రద్దీమయంగా కనిపించాయి. కొంతమంది ప్రయాణికులను వారి బంధువులు, తల్లిదండ్రులు కాంప్లెక్స్‌లో వీడ్కోలు పలుకుతూ కనిపించారు. దూరప్రాంతాలైన హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ తదితర చోట్లకు ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం, వారు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా ఉండేందుకు అదనపు బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు అన్ని చర్యలూ చేపట్టారు.

నాన్‌స్టాప్ క్యూలైన్లలో బారులు

దూరప్రాంతాల కోసం ప్రయాణం చేసేందుకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు అధిక సంఖ్యలో ప్రయాణికులు చేరుకున్నారు. విశాఖపట్నం వెళ్లేందుకు, నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించేందుకు క్యూలైన్లలో టికెట్ల కోసం బారులుతీరుతూ కనిపించారు. నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు.

రద్దీని పర్యవేక్షించిన అధికారులు

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీని ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు, శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మ, ఆర్టీసీ అధికారులు ఎల్ఎస్ నాయుడు, ఎంపీ రావు, ప్రసాద్, రాజు తదితరులు పర్యవేక్షిస్తూ, కాంప్లెక్స్‌కు చేరుకున్న ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా ఎప్పటికప్పుడు అదనపు బస్సులను వేస్తున్నారు. నాన్‌స్టాప్ కౌంటర్లలో ప్రయాణికులు బారులుతీరి ఉంటే వెంటనే పల్లెవెలుగు బస్సులను నాన్‌స్టాప్ బస్సులుగా వేసి రద్దీ నివారించేందుకు చర్యలు తీసుకున్నారు.



కాంప్లెక్స్‌లో రాత్రి సమయంలో వేచి ఉన్న ఒక కుటుంబసభ్యులు

పల్లె వెలుగులే నాన్‌స్టాప్‌లు

నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికులు బారులుతీరుతూ కనిపించడంతో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం ఉదయం అంతగా కనిపించని రద్దీ మధ్యాహ్న భోజనం అనంతరం విపరీతంగా పెరిగింది. ప్రయాణికులు తమ తిరుగు ప్రయాణం కోసం కాంప్లెక్స్ చేరుకోవడంతో ఒక్కసారిగా జనసందోహం కనిపించింది. టికెట్ల కోసం బారు లుతీరుతూ కనిపించారు. దీంతో ఆర్టీసీ అధికారులు వెంటవెంటనే చర్యలు తీసుకుని పల్లెవెలుగు బస్సులను నాన్‌స్టాప్‌లుగా నడిపారు. పల్లెవెలుగు బస్సులను నాన్‌స్టాప్ ప్లాట్‌ఫాంపై నిలిపి ప్రయాణికులను అందులో ఎక్కమని ట్రాఫిక్ గైడ్‌లు పిలవడం కనిపించింది. దీంతో నాన్‌స్టాప్ క్యూలైన్లలో టికెట్‌ల కోసం నిల్చున్న ప్రయాణికులు తమ ప్రయాణం సుఖవంతంగా సాగిపోతే చాలనుకుని పల్లెవెలుగు బస్సులను ఆశ్రయించారు. అయితే ఈ బస్సులకు మాత్రం సాధారణ ఛార్జీలే వసూలు చేశారు.



పల్లె వెలుగులే నాన్‌స్టాప్‌లుగా..

పేదల చదువులు ప్రభుత్వానికి పట్టవా

- వైఎస్సార్‌సీపీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి పేద పిల్లల చదువులంటే లెక్కలేదని వైఎస్సార్‌సీపీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు, కాళింగ కుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల రామారావు (లక్ష్మణరావు) అన్నారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ధనిక వర్గాలతో సమానంగా పేదవాడికి నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చిందన్నారు. అయితే దానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడవడం సరికాదన్నారు. విద్యార్థులకు విద్యను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకానికి శ్రీకారం చుడితే, ఈ పథకానికి బాబు సర్కార్ మంగళం పాడడం సరికాదన్నారు. విద్యా సంవత్సరం పూర్తవుతున్నా సర్కార్ లబ్ధిదారులకు తల్లికి వందనం నిధులు విడుదల చేయకపోవడంపై మండిపడ్డారు. యూపీ పాఠశాలలు విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. విలీనం చేయడమంటే బాల కార్మికులను తయారు చేయడమేనని పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ, ఎంసీఏ, ఎంబీఏ కోర్సులు చదువుకున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకుండా మరింత తాత్సారం చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలుచేసి పేదల విద్యకు సహకరించాలన్నారు.

జాయి శ్రీకాంత్ మృతి



జాయి శ్రీకాంత్

నరసన్నపేట: మండలంలోని మడపాం వద్ద 170 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం నిర్మాణ కమిటీ కార్యదర్శి జాయి శ్రీకాంత్ (52) ఆకస్మికంగా మృతి చెందారు. ఆరోగ్యం బాగోలేదని టెక్కలిలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి శనివారం వైద్యం కోసం వెళ్లారు. అయితే అక్కడే చికిత్స పొందుతూ మరణించారు. దీంతో భార్య సత్యవతి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కాగా మడపాం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహం నిర్మాణంలో రామభక్త హనుమాన్ సేవా సమాజ్ పేరిట శ్రీకాంత్ కీలక పాత్ర వహించారు. విగ్రహం శంకుస్థాపన నుంచి నిర్మాణం పూర్తి చేసి ప్రతిష్ట చేసినంత వరకూ ఎంతో శ్రమించారు. ప్రస్తుతం విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు స్థానిక అర్చకుల సహకారంతో చేస్తున్నారు. ఈయన మృతి సమాచారం తెలిసిన వెంటనే మడపాంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన చెందారు. కాగా శ్రీకాంత్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ప్రముఖుల సంతాపం

శ్రీకాంత్ మృతికి మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ ఆరంగి మురళి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చింతు రామారావు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్‌బీ గుప్త, మడపాం ఎంపీటీసీ రువ్వ వాసు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



బొడ్డు యశోదమ్మ(ఫైల్)

బూర్జ: మండలంలోని బూర్జ పంచాయతీ చిన్నకురింపేట గ్రామానికి చెందిన బొడ్డు యశోదమ్మ(59) శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆమెతో కలిసి 9 మంది కనుమ రోజు బుధవారం సీతంపేట మండలానికి పర్యటనకు వెళ్లారు. అక్కడ ఆడలి వ్యూ పాయింట్ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడి దెబ్బలు తగిలాయి. దీంతో 9 మందిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. వీరిలో బొడ్డు యశోదమ్మ తలకు బలమైన దెబ్బలు తగలడంతో చెవి నుంచి రక్తస్రావం జరిగింది. దీంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి ఆమెను తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. ఆమెకు భర్త లచ్చుము, ఇద్దరు వివాహమైన ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన చంద్రశేఖర్

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హిరమండలం మండలం కొండరాగోలు గ్రామానికి చెందిన సన్నబోయిన చంద్రశేఖర్(25) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు చంద్రశేఖర్ దుబాయ్‌లో వెల్డింగ్ పనులు చేస్తూ ఇటీవల సంక్రాంతి పండగకు తన స్వగ్రామం వచ్చాడు. ఆమదాలవలసలో ఉన్న తన స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ఆ సమయంలో ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని సర్వజన ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు.

పాడుబడిన ఇంట్లో మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి. పురం పంచాయతీ పరిధి రైల్వే స్థలంలో ఉన్న పాడుబడిన ఇంట్లో గుర్తు తెలియ ని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. ఆశవర్కర్ రాపాక డిల్లమ్మ ఆ ఇంటిని చాలా రోజుల క్రితం ఖాళీ చేసి, కంచిలిలో ఇందిరమ్మ కాలనీలో నిర్మించుకున్న ఇంటికి వెళ్లిపోయింది. ఆ వదిలేసిన పూరి గుడిసెలో గుర్తు తెలియని వ్యక్తి ఉరిపోసుకొని మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఇంటి నుంచి గత నాలుగు రోజులుగా దుర్వాసన రావడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహానికి సోంపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి వయ స్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన దేహ దారుఢ్య పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలు శనివారంతో ముగిశాయి. గత నెల డిసెంబర్ 30వ తేదీ నుంచి ఈనెల 18వ తేదీ వరకు సెలవు రోజుల్లో మినహా ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించినవారికి ఈ దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించి, అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. త్వరలో రాత పరీక్ష తేదీని ప్రకటించనున్నారు. అభ్యర్థులకు కేటాయించిన తేదీల్లో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. గతంలో హాజరు కానివారికి సైతం చివరి మూడు రోజుల్లో అవకాశం కల్పించారు. అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలత, 1,600 మీటర్లు, 100 మీటర్లు రన్నింగ్, లాంగ్ జంప్ ఈవెంట్లు ఎంపిక నిర్వహించారు. ఈవెంట్‌లో ఎటువంటి అక్రమాలకు చోటు లేకుండా ఎత్తు, రన్నింగ్ నిర్ధారణకు సెన్సార్లు వినియోగించారు. ఛాతీ కొలత, లాంగ్ జంప్‌లను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంపికలు నిర్వహించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కాగా, శనివారం 416 మందికి గాను 336 మంది హాజరయ్యారు. తుది పరీక్షకు 204 మంది అర్హత సాధించారు.



అభ్యర్థిని లాంగ్ జంప్



రన్నింగ్‌కు సమాయత్తమవుతున్న అభ్యర్థినులు



అభ్యర్థుల చాతీ కొలతలు చూస్తున్న దృశ్యం

రూ.2 లక్షల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సోంపేట: మండలంలోని గొల్లగండి సచివాలయంలో సంక్షేమ, విద్యాసహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న రట్టి జయరాం గతేడాది ఆగస్టులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో జిల్లా పరిధిలోని సంక్షేమ సహాయకులందరూ సంఘం తరుపున రూ. 2,25,000లు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం కొర్లాం గ్రామంలో జయరాం భార్య శోభారాణి, కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఈగల తిరుపతిరావు మాట్లాడుతూ తోటి ఉద్యోగులంతా జయరాం కుటుంబానికి బాసటగా నిలవడం శుభ పరిణామమన్నారు. కష్టాలో ఉన్నవారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. శోభారాణి కారుణ్య నియామకానికి సంక్షేమ, విద్యా ఉద్యోగుల సంఘం తరుపున కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జాయింట్ కార్యదర్శి యువరాజ్, గౌరవ అధ్యక్షుడు రమేష్, పలు మండలాలకు చెందిన ప్రతినిధులు పాపారావు, కిషోర్, వాసు, రంగారావు, వసంత్‌కుమార్, మోహన్, భాస్కర్, జోగారావు, చైతన్య, చిరంజీవి, శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

22న న్యాయ సత్యాగ్రహ దీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 22న 'చలో విజయవాడ' పేరిట చేపడుతున్న 'న్యాయ సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ), ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కె.గురవయ్య, బి.రవికుమార్, డి.మురళీధర్, ఒ.నాగసురేష్, జిల్లా ముఖ్య ప్రతినిధులు దన్నాన ఫల్గుణరావు, గణపతి వెంకటేశ్వరరావు, ఎస్.అన్నపూర్ణారావు, బర్రి గోవిందరావు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1998లో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన టీచర్లకు ప్రమోషన్ ద్వారా ఉద్యోగోన్నతి కల్పించి జూనియర్ లెక్చరర్లుగా నియమించారని, అప్పటి నుంచి జీవో 302 ప్రకారం ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన ప్రిన్సిపాల్స్‌గా, డిగ్రీ కళాశాలల అధ్యాపకులుగా ఉద్యోగోన్నతి కల్పించారని చెప్పారు. 2024 మార్చి 16న డీపీసీ అధ్యాపకులను పక్కనపెట్టి సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా అనర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించారని పేర్కొన్నారు. అన్యాయాన్ని సరిదిద్ది అక్రమ ఉద్యోగోన్నతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లేందుకు ఈ నెల 22న విజయవాడలోని ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ కార్యాలయం ఎదుట న్యాయ సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. శాంతియుత మార్గంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ చలో విజయవాడ కార్యక్రమానికి జూనియర్ లెక్చరర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

దన్నానపేటలో విషాదఛాయలు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం



గొర్లె దుష్యంత్ (ఫైల్)

ఆమదాలవలస: మండలంలోని దన్నానపేట గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గొర్లె దుష్యంత్(చిన్ని)(25) పాలకొండ రోడ్‌లో ఉప్పినవలస- వైకుంఠపురం గ్రామాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సొంత గ్రామం దన్నానపేట కావడంతో మృతుడు సెలవులకు వచ్చి తన స్నేహితులతో పాలకొండలో గెట్ టు గెదర్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అనంతరం అక్కడ నుంచి దన్నానపేటలో ఉన్న తన పెద్దనాన్న గొర్లె వాసు ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మృతదేహానికి రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో శవపంచనామా చేసి దన్నానపేట గ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి తండ్రి గొర్లె జగన్నాథరావు, తల్లి రమాదేవి, ఒక అన్నయ్య ఉన్నారు. కుటుంబాన్ని పోషించే సమయంలో ఇలా కొడుకు మృత్యువాత పడడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. అంతవరకు సరదాగా ఉండే తన కుమారుడు ఇలా విగతజీవిగా మారడంతో వారు కన్నీరు మున్నీరై విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

సమష్టి కృషితో అభివృద్ధి

ఎచ్చెర్ల క్యాంపస్: సమష్టి కృషితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అభివృద్ధి సాధ్యమవుతుందని వీసీ కె.ఆర్.రజిని అన్నారు. ఆమె వీసీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తైన సందర్భంగా సిబ్బంది శనివారం నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో వర్సిటీని ఉన్నతంగా భవిష్యత్తులో తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. వర్సిటీలో ఉన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. నాక్‌లో ఉన్నత గ్రేడ్ లక్ష్యంగా సిబ్బంది ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విలువలు, నైపుణ్యంతో కూడిన విద్య అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.